సాక్షి తిరుపతి

శనివారం ၊ 20 ၊ జూలై ၊ 2024



శుభకార్యానికి వెళ్లి వస్తూ..

లారీ రూపంలో మృత్యువు కబళించింది. శుభకార్యానికి వెళ్లి వస్తున్న ముగ్గురు వ్యక్తులను బలితీసుకుంది. - 8లో



వేధింపులు ఆపండి

జిల్లాలో చిరుద్యోగులపై కూటమి నేతల వేధింపులు ఆపాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. - 8లో



చిరుత ఆచూకీ ఎక్కడ?

కొటాల జగనన్న కాలనీ సమీపంలో సంచరిస్తున్న చిరుతను బంధించేందుకు చర్యలు చేపట్టినట్టు డీఎఫ్‌ఓ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

బంగారు తిరుచ్చిపై అభయం



బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారి పట్టపురాణి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేక సేవను చేపట్టి సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ ముఖమండపం వద్ద స్వామి, అమ్మవార్లకు పాంచరాత్ర ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపంలో విద్యుత్ దీపాల కాంతుల నడుమ శ్రీవారి పట్టపురాణికి ఊంజల్ సేవను చేపట్టారు. అనంతరం అలంకార భూషితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

బస్టాండ్‌లో తనిఖీలు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ఆర్టీసీ ఉద్యోగులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం బస్టాండ్‌లోని చెన్నై ప్లాట్‌ఫాం వద్ద 16 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రతి రోజూ నాలుగు సార్లు అన్ని ప్లాట్‌ఫాంల్లో తనిఖీలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇవ్వడంతో నిఘా పెంచారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రాంగణంలో శ్రీహరి, శ్రీనివాస, ఏడుకొండలు, పల్లె వెలుగు పేరుతో నాలుగు బస్టాండ్లు ఉండగా.. ఈ బస్టాండ్లలో 64 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. 147 ఆర్టీసీ దుకాణాన్నాయి. అన్ని ప్లాట్‌ఫాంల్లో తనిఖీలు చేస్తున్నారు.

నేడు 28వ బ్యాచ్‌కి శిక్షణ



ఎస్.హరిబాబు, అలిపిరి డిపో మేనేజర్

తిరుపతి అర్బన్: తిరుపతి అలిపిరి ఆర్టీసీ డిపోలో 28వ బ్యాచ్‌కి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం శనివారం నుంచి శిక్షణ ప్రారంభించనున్నట్టు అలిపిరి డిపో మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.హరిబాబు తెలిపారు. ఇప్పటివరకు ఒక్కో బ్యాచ్‌లో 16 మంది చొప్పున 27 బ్యాచ్‌ల్లో 432 మందికి హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌లో శిక్షణ ఇచ్చినట్టు వెల్లడించారు. ఆర్టీసీ నేతృత్వంలో నామమాత్రపు ఖర్చులతో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ తోపాటు మెకానిజంలోనూ పట్టుసాధించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని శ్రీ ప్రగాడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ ఐఐహెచ్‌టీలో గంటల ప్రాతిపదికిన బోధన చేయడానికి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓఎస్‌డీ ఎస్ గిరిధర్‌రావు తెలిపారు. మ్యాథమ్యాటిక్స్, కెమిస్ట్రీ, ఇంజినీరింగ్ వర్క్‌షాపు ప్రాక్టీస్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఇన్ ఇంగ్లిషు, ఇంజినీరింగ్ మెకానిక్స్, ఫిజిక్స్, ఐటీ సిస్టమ్స్, ఫండమెంటల్ ఆఫ్ ఎలక్ట్రికల్‌లో బోధించడానికి అధ్యాపకులు అవసరమని, ఆసక్తి గల వారు 9441795408 , ఐఐహెచ్‌టీ పనివేళలల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

అధైర్యపడొద్దు!

కూటమి మూకల దాడులతో తీవ్రంగా నష్టపోయిన వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి భరోసా నిచ్చారు. బెదిరింపులకు బెదరొద్దని, కలిసికట్టుగా నిలబడితే ఎవ్వరూ 'టచ్' చేయలేరని తేల్చిచెప్పారు. కూటమి మూకల దాడుల్లో నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆర్థికంగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అందులో భాగంగా శుక్రవారం సోమల మండలం, కమ్మపల్లిలో టీడీపీ నేతల దాష్టీకానికి తీవ్రంగా నష్టపోయిన సుబ్రమణ్యంరెడ్డి కుటుంబానికి తక్షణం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా నష్టపోయిన ప్రతి కుటుంబాన్నీ ఆదుకునేందుకు కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. కూటమి మూకల దాడులకు తెగబడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఒకవేళ వారు కేసు నమోదు చేయకపోతే ప్రైవేటు కేసులు వేసి వారికి శిక్షపడేంత వరకు పోరాడుతానని స్పష్టం చేశారు.

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి భరోసా
- నష్టపోయిన ప్రతి కార్యకర్తకు ఆర్థిక సాయం
- టీడీపీ మూకల దాడుల్లో నష్టపోయిన వారిని గుర్తించేందుకు కమిటీలు
- కేసులు పెట్టినా తానే చూసుకుంటానని హామీ
- దాడులు చేస్తే కేసులు పెట్టండి..
- పట్టించుకోకపోతే కోర్టు ద్వారా ప్రైవేటు కేసులు
- కలిసికట్టుగా కూటమి మూకల దాడులను ఎదుర్కోవాలని పిలుపు

సాక్షి ప్రతినిధి, తిరుపతి/సదుం: టీడీపీ మూకల అరాచకాలు, విధ్వంసాలపై న్యాయపోరాటం చేసేందుకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సిద్ధమయ్యారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు రెండు రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సదుం మండలం, యర్రాతివారిపల్లెలో పుంగనూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. టీడీపీ మూకల దాడుల్లో తీవ్రంగా నష్టపోయిన వారిని, భయంతో ఊరొదిలి వెళ్లిన వారిని పిలిపించుకుని వారికి భరోసా కల్పించారు. మండలాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ గత కొద్ది రోజులుగా కూటమి మూకలు చేస్తున్న దాడులు, దౌర్జన్యాల గురించి ప్రస్తావించారు.

ఐకమత్యమే మహాబలం

పుంగనూరు నియోజకవర్గంలోని రొంపిచెర్ల,పులిచెర్ల, సదుం, సోమల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఎంపీ విడివిడిగా సమావేశమయ్యారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఐకమత్యంగా ఉంటే ఎవ్వరూ ఏమీ చేయలేరని పిలుపునిచ్చారు. పచ్చ మూకల దాడుల్లో ఆస్తి నష్టం కలిగిన ప్రతి కార్యకర్తకూ తాను సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా బాధితులను గుర్తించి వారికి సాయం చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేశారు. తప్పుడు కేసులకు భయపడాల్సిన పనిలేదని, ఆ కేసులన్నీ తాను ఎదుర్కొంటానని హామీ ఇచ్చారు. అన్యాయంగా తనపై, మాజీ ఎంపీ రెడ్డెప్పపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడనని, తనను నమ్ముకున్న కార్యకర్తలను వదిలేది లేదన్నారు. ఎక్కువ సమయం ప్రజల మధ్య ఉంటానని పేర్కొన్నారు. ఇంటింటా పర్యటిస్తానని తెలిపారు. గ్రామాలలో దౌర్జన్యాలు చేయడానికి వచ్చే వారిపై భయపడకుండా అందరూ కలిసికట్టుగా ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ మద్దతుదారులపై తప్పుడు కేసులు పెడితే వారికి ఆర్థిక భారం కలగకుండా న్యాయపోరాటం చేసేందుకు తాను సహకరిస్తానన్నారు. దౌర్జన్యాలు చేసే వారిపై కేసులు పెట్టాలని, స్టేషన్‌లో వాటిని తీసుకోకపోతే తన దృష్టికి తెస్తే ప్రైవేటు కేసులు నమోదు చేయిస్తానన్నారు. దౌర్జన్యాలను మౌనంగా సహిస్తుంటే మరింతగా రెచ్చి పోతారని, ఆ అవకాశం ఇవ్వరాదని చెప్పారు. ఈ ఐదేళ్లు ఏ సహాయం కోసం అయినా తనని సంప్రదించవచ్చన్నారు. 90 శాతం పనులకు ప్రభుత్వ సహాయం అవసరం లేదని, తాను చేయించగలనని అన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు నిలిపివేస్తే కోర్టుకు పోతామన్నారు. ఉద్యోగ అవకాశాలను పెంపొందించేందుకు ఫ్యాక్టరీలను తీసుకొస్తే వాటిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గతంలో టీడీపీ నియోజకవర్గ అభివృద్ధిపై వివక్షచూపితే ఎంపీ నిధులతో అభివృద్ధి చేశామన్నారు. ఇప్పుడు నియోజకవర్గాన్ని వారు అభివృద్ధి చేయరని, కక్ష్య సాధింపులే వారికి అవసరమని తెలిపారు. ఎంపీ నిధులతో సాధ్యమైనంత మేర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

సంక్షేమ పథకాల అమలు కష్టమే

కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు చేసే విధానంపై ఎంపీ మిథున్‌రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. పలువురి పింఛన్లను తొలగించే అవకాశం ఉందన్నారు. ఉద్యోగులకు సంబంధించి సీఎంకు తెలియకుండా జీపీఎస్ జీఓ ఎలా బయటకు వస్తుందని ప్రశ్నించారు. అమ్మకు వందనం, రైతు భరోసా ఎప్పటికి అందుతాయో స్పష్టత లేదన్నారు.

భారీగా తరలివచ్చిన శ్రేణులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

ఎర్రాతివారిపల్లెలో నిర్వహించిన సమావేశానికి అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. వారి సమస్యలను పేరు పేరున ఎంపీ అడిగి తెలుసుకున్నారు. పార్టీ మద్దతుదారులకు ఏ కష్టం వచ్చినా తమ కుటుంబం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఎప్పుడైనా తమను సంప్రదించవచ్చని, 24 గంటలు తమ కుటుంబ సభ్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నాయకులు అభిప్రాయ బేధాలను పక్కనబెట్టి ఐకమత్యంగా ఉండాలన్నారు. లోపాలను సరిచేసుకుని మరింతగా పటిష్టం చేసుకుందామన్నారు. లాభమైనా, నష్టమైనా కలిసి పోరాడే వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీటీడీ మాజీ బోర్డు మెంబర్ పోకల అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పృథ్వీరెడ్డి, పులిచెర్ల ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, నాదమునిరెడ్డి, ఇబ్రహీం ఖాన్, రెడ్డీశ్వర్‌రెడ్డి, అమాసమోహన్, నాగేశ్వరరావు, రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కల్యాణ భరత్, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



ఎంపీకి స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

టీడీపీ కార్యకర్తల్లారా.. కళ్లు తెరవండి

'చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల్లారా.. కళ్లు తెరవండి.. పులివర్తి నాని వ్యాపారాలకు గత ఐదేళ్లు నేను గానీ, అప్పటి మా ప్రభుత్వ మంత్రి పెద్దిరెడ్డి గారు గానీ ఎటువంటి ఇబ్బందులు కలిగించలేదు. నానిపై ఏనాడూ ఏ కేసూ పెట్టలేదు. పులివర్తి నాని క్వారీపై తనిఖీలకు వెళుతుంటే స్వయంగా మైనింగ్ అధికారులతో నేనే మాట్లాడి నిలుపుదల చేయించాను.. ఇది వాస్తవం..' అంటూ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు.

- నానీపై ఏనాడూ..ఏ కేసూ పెట్టలేదు
- ఆయన వ్యాపారాలకు పెద్దిరెడ్డి, నేను సహకరించాం
- మమ్మల్ని విలన్లుగా చూపించి పదవులు పొందాలనుకుంటున్నారు
- కిలారి రాజేష్ పేరు చెప్పుకుని దందాలు చేయడం న్యాయమా?
- మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రవర్తించిన తీరును పవర్ ప్రజెంటేషన్ ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుచానూరు (చంద్రగిరి): 'టీడీపీ అధికారంలోకి వచ్చిన 50 రోజుల్లో చంద్రగిరి నియోజకవర్గంలో 34 మంది వైఎస్సార్‌సీపీ నేతలపై భౌతిక దాడులకు పాల్పడ్డారు. అర్ధరాత్రిపూట ముసుగులు వేసుకొచ్చి కొడుతున్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. పల్లెల్లో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు' అని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి శిల్పారామం సమీపంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లు పల్లెల్లో ఒక చిన్న రాజకీయ గొడవకు కూడా అవకాశం లేకుండా పరిపాలన సాగించానని, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్నారు. కరోనా సమయంలో చంద్రగిరి ఎమ్మెల్యేగా తాను కులం, మతం, పార్టీ అన్న తేడాలు లేకుండా అందరినీ కంటికి రెప్పలా కాపాడానన్నారు. అయితే అందుకు భిన్నంగా నేడు రౌడీయిజం రాజ్యమేలుతోందని విమర్శించారు.

నానీని ఇబ్బందులు పెట్టలేదు

'నానీకి చెందిన స్టోన్ పాలింగ్ ఇండస్ట్రీకి విద్యుత్ బకాయిలు కట్టకపోయినా ఫ్యాక్టరీ ఐదేళ్లు కొనసాగింది. నానీ బంధువు గిరినాయుడు పాకాలలో 8 హెక్టార్ల బ్లాక్ గ్రానైట్ ఫ్యాక్టరీ తీసుకున్న మాట వాస్తవం కాదా?. నానీకి సంబంధించిన ఏ క్వారీకీ, ఆయన చెప్పిన ప్రతి క్వారీకీ ఐదేళ్లలో పర్మిషన్లు ఆగలేదు. నానీకి సంబంధించిన హోసూరు, చెన్నైకి తరలించే 12 గ్రానైట్ ట్రాన్స్‌పోర్టు లారీలు ఒక్కరోజైనా ఆగాయా? చిత్తూరులో నానీకి సంబంధించిన రెండు పెద్ద క్వారీలు ఐదేళ్లలో ఒక గంటయినా మూశారా..? ఎన్నికలకు ముందు మీ క్వారీలకు ఫైన్ వేసినట్టు, స్టే తెచ్చుకున్నట్టు ఆడింది నాటకం కాదా? ఈ విధంగా ఐదేళ్ల వ్యాపారాలకు, మీ ఆదాయాలకు మమ్మల్ని వాడుకుని ఈరోజు విలన్లుగా చూపించి పదవులు మీరు పొందాలని చేస్తున్న ప్రయత్నం నిజం కదా..? వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో పెద్దిరెడ్డిని, నన్ను వాడుకున్న మాట వాస్తవం కదా?. ప్రతి నిత్యం లోకేష్ సన్నిహితుడు కిలారి రాజేష్ పేరు చెప్పుకుని చంద్రగిరిలో దందాలు, అధికారులకు బెదిరింపులు చేయడం తప్పుకదా?. ఈ రోజు మీకు ఏ రకమైన గాయం తగల్లేదని స్విమ్స్ వైద్యులు ఇచ్చిన రిపోర్టు నిజమే కదా?' అని చెవిరెడ్డి ప్రశ్నించారు. చంద్రబాబు పాలనలో నంది అవార్డులు ఇస్తే పులివర్తి నాని నటనకు మొదటి అవార్డు ఇవ్వాలన్నారు. నాయకుడనే వ్యక్తికి నిబద్ధత ఉండాలనీ, మాటలో, ప్రవర్తనలో స్పష్టత, పెద్దరికం ఉండాలన్నారు. డ్రామా లు నాటకాలతో గడిపే వ్యక్తి నాయకుడెలా అవుతాడని ప్రశ్నించారు.

నా కార్యకర్తల కోసం ఎందాకైనా..

''ఇకపై వైఎస్సార్‌సీపీకి చెందిన ఒక్క కార్యకర్తపై చేయివేసినా ఊరుకోం. కొత్తగా ఎమ్మెల్యే అయిన వారికి పరిపాలించే అవకాశం ఇద్దామనుకున్నా. బయటకు వెళ్లి వ్యాపారం చేసుకుందామనుకున్నా. కానీ నన్ను నమ్మిన పార్టీ కేడర్‌ను ప్రతిరోజూ కొడుతూ ఉంటే ఉండలేకపోతున్నా. అందుకే ఇకపై పూర్తి సమయం కేడర్‌తోనే ఉండాలని నిర్ణయించుకున్నా. ప్రతిపక్షంలో నా పోరాటం ఎలా ఉంటుందో తెలిసేలా చేస్తా. నా కార్యకర్తల జోలికి వస్తే వారికి వడ్డీతో సహా చెల్లించుకుంటాం'' అని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు.

వైద్య అధ్యాపకులకు ముగిసిన శిక్షణ

తిరుపతి తుడా : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాలలో వైద్యవిద్య అధ్యాపకులకు నిర్వహించిన రెండు రోజుల శిక్షణ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సదస్సులో నేషనల్ మెడికల్ కమిషన్, న్యూ ఢిల్లీ వారు ప్రవేశ పెట్టిన నూతన బోధనా విధానాలు, పరీక్షల్లో మార్పులు చేర్పులపై అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ మొత్తం 30 మంది అధ్యాపకులకు శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కిరీటి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ డీఎస్ మూర్తి, డాక్టర్ ప్రతిభ స్రవంతి, డాక్టర్ రమాదేవి, డాక్టర్ మాధవీలత, డాక్టర్ మనోహర్, డాక్టర్ ఇంద్రాణి, డాక్టర్ ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్సు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



నిమ్మకాయల కోసం పోటీ పడుతున్న భక్తులు



తపస్మాన్‌పై అర్జున వేషధారి

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అర్జునుడు తపస్సు చేసి శివునితో పోరాడి తర్వాత తప్పు తెలుసుకుని పాశుపతాస్త్రాన్ని పొందే ఘట్టం మహాభారతంలో ఉంది. ఈ నేపథ్యంలో అర్జున వేషధారి ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన తపస్మాన్ వద్ద పద్యాలు ఆలపిస్తూ తపస్మాన్‌ను అధిరోహించారు. తర్వాత మంత్రించిన నిమ్మకాయలను తపస్మాన్ చెట్టుపై నుంచి భక్తులపైకి వెదజల్లాడు. వాటి కోసం భక్తులు పోటీ పడ్డారు. ఈ నిమ్మకాయలు తింటే సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. అంతే కాకుండా కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. ఈ క్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. ఆలయ ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.76,150
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,820
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.92,700
రిటైల్ వెండి గ్రాము	రూ.94.70

క్లుప్తంగా

ఏసీ బోగి బ్రేక్ ఫెయిల్


ఏసీ బోగీ వద్ద గుమిగూడిన ప్రయాణికులు

దొరవారిసత్రం : నిజాముద్దీన్ నుంచి మధురైకు వెళ్లే తమిళనాడు సంపర్క్ క్రాంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బ్రేక్ డౌన్ కావడంతో దొరవారిసత్రం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం 20 నిమిషాలు పాటు ఆగిపోయింది. వివరాలు... సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లోని త్రీటైర్(బీ5) ఏసీ బోగీకి చెందిన బ్రేక్‌లో సాంకేతిక లోపం ఏర్పడి ఫెయిల్ కావడంతో స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆఫ్‌లైన్‌పై శుక్రవారం మధ్యాహ్నం 1.55 నిమిషాలకు ఆగిపోయింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు హుటాహుటిన త్రీటైర్ బోగీకు చెందిన బ్రేక్‌లకు మరమ్మతులు చేపట్టారు. ఆగిపోయిన ఈ రైలు తిరిగి 2.15 నిమిషాలకు చెన్నై వైపునకు బయలుదేరి వెళ్లింది.

కత్తెర పురుగుతో జాగ్రత్త


మొక్కజొన్న పంటను నాశనం చేస్తున్న కత్తెర పురుగు

తిరుపతి సిటీ: మొక్కజొన్న, పశుగ్రాస పంటలను పండించే రైతులు వర్షాకాలంలో కత్తెర పురుగుతో జాగ్రత్తగా ఉండాలని, నివారణా చర్యలు వెంటనే చేపట్టాలని తిరుపతి ఆర్ఏఆర్ఎస్ సంచాలకులు డాక్టర్ వి స్రవంతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కే.దేవకి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పంట చుట్టూ ఎకరాకు నాలుగు చొప్పున లింగాకర్షక బుట్టలు అమర్చుకుని, కలుపులేకుండా చూసుకోవాలని తెలిపారు. పంట తొలిదశలో వేపగింజల కషాయం, వేప నూనెను 5మి.లీ నీటిలో పిచికారీ చేస్తే మంచి ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు.

ఇచ్చుకుంటినమ్మా..పుచ్చుకుంటినమ్మా!

- వెల్లివిరిసిన మతసామరస్యం
- రొట్టెలు ఇచ్చిపుచ్చుకున్న ముస్లిం, హిందువులు
- కిక్కిరిసిన దో షహీద్ దర్గా


నీటి తొట్టెల వద్ద రొట్టెలు మార్చుకుంటున్న మహిళలు

చిల్లకూరు: మొహర్రం పండుగ ముగిసిన మూడో రోజు చిల్లకూరులోని దో షహీద్ దర్గా భక్తులతో కిటకిటలాడింది. మొహర్రంను పురస్కరించుకుని నెల్లూరులోని బారా షహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇదే క్రమంలో చిల్లకూరులోని దో షహీద్ దర్గాలో కూడా రొట్టెల పండుగను నిర్వహిస్తుంటారు. ఇక్కడ నీరు అందుబాటులో లేక పోవడంతో నిర్వాహకులు పెద్ద తొట్టెలను నిర్మించి అందులో రొట్టెలు పట్టుకునేలా చేస్తున్నారు. నెల్లూరుకు వెళ్లలేని ముస్లింలు, హిందువులు మతసామరస్యానికి ప్రతీకగా సోదర భావంతో ఇక్కడ రొట్టెలను ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం చిల్లకూరులోని దో షహీద్ దర్గా వద్దకు గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన భక్తులు పోటెత్తారు. దర్గా వద్ద జరిగిన రొట్టెల పండుగలో సయ్యద్ మహ్మద్ షా, సయ్యద్ అహ్మద్ షా సమాధులను భక్తులు దర్శించుకున్నారు. హిందు, ముస్లింలు భక్తి భావంతో ఈ సహోదరుల దర్గాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తమిళనాడు, కర్ణాటక నుంచివచ్చి నెల్లూరులోని రొట్టెల పండుగను చూసుకుని తిరుగు ప్రయాణంలో ఇక్కడ దర్గాలోని సమాధులను దర్శించుకున్నారు. దర్గాలను దర్శించుకుని ఖూందీని సమర్పించి రొట్టెలను వదిలితే అనుకున్న పని జరుగుతుందని భక్తుల విశ్వాసం. ఇందులో భాగంగా ఇక్కడ ముస్లిం, హిందూ మహిళలు ఇచ్చుకుంటినమ్మ, పుచ్చుకుంటినమ్మ అంటూ రొట్టెలను అందించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్గా నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు. ముతవల్లి జుబేద్ బాషా భక్తులకు ప్రసాదాలను అందించారు.

ఒకటిన గంధోత్సవం

సహోదరులైన సయ్యద్ అహ్మద్‌షా, సయ్యద్ మహ్మద్‌షాల సమాధుల వద్ద ఆగస్టు ఒకటవ తేదీ గురువారం రాత్రి భారీ ఎత్తున గంధోత్సవం నిర్వహించనున్నట్టు దర్గా నిర్వహకులు, ముతవల్లి జుబేద్ బాషా తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 67,223 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,549 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.66 కోట్ల రాబడి వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

రైతులకు న్యాయమైన పరిహారం


వేరుశనగ రైతుతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

చిల్లకూరు: భూ సేకరణలో భాగంగా భూములు నష్టపోయే రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. చెన్నై- బెంగళ్లూరు ఇండస్ట్రీయల్ కారిడార్‌లో భాగంగా మండల తీర ప్రాంతంలోని తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ్మినపట్నం రెవెన్యూ పరిధిలోని భూములను ఏపీఐఐసీ ద్వారా సేకరించేందుకు గత కొన్ని సంవత్సరాలుగా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. అయితే ఇక్కడి రైతులకు పరిహారం విషయంలో పలు అనుమానాలు ఉండడంతో భూ సేకరణ జరగడం లేదన్నారు. దీనిపై రైతులకు సరైన న్యాయం చేయడంతో పాటుగా భూ సేకరణను వేగవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. చిల్లకూరు, కోట మండలాల్లో భూ సేకరణ చేపడుతున్నామని, ఇందులో తమ్మినపట్నం రెవెన్యూలో పట్టా భూమి, అసైన్‌మెంటు, డీకేటీ పట్టాలు కొంత ఉండగా, ఎక్కువగా 914 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. దీనిని సేకరించే సమయంలో రైతులు తాము పదేళ్ల సాగు చేసుకుని జీవనం చేస్తున్నామని అడ్డు పడుతున్నారని తెలిపారు. వారికి సరైన పరిహారం అందించేలా చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు. కొన్ని జీఓల మేరకు కొత్తగా సాగు చేపట్టిన వారికి పూర్తిగా పరిహారం ఇచ్చే వీలుండదని దీనిని రైతులు గుర్తించాలన్నారు. అనంతరం వేరుశనగ సాగు చేస్తున్న రైతులతో క్షేత్ర స్థాయిలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. తమ్మినపట్నం, లింగవరం, వరగలి పంచాయతీలలో ఉన్న పలు సమస్యలను ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ్మినపట్నంలో కండలేరు క్రీక్ ద్వారా కోతకు గురైన కట్టలను బాగుచేసే విషయం సీఎంతో మాట్లాడుతామన్నారు. అలాగే దళితవాడకు చెందిన ఇళ్ల స్థలాలపై పోర్టు యాజమాన్యంతో మాట్లాడి వారికి అభ్యంతరం లేక పోతే పట్టాలు ఇచ్చే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అలాగే పల్లెవాని దిబ్బ గ్రామం పూర్తిగా ఏపీఐఐసీ కింద ఉండడంతో గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేక పోతున్నట్టు సర్పంచ్ సుబ్రహ్మణ్యం విన్నవించారు. మన్నేగుంట గ్రామంలోని సమస్యలపైనా పరిశీలన చేస్తామని, సాగరమాల, ఇండస్ట్రీయల్ కారిడార్‌తో పాటు ఇతర అవసరాలకు సేకరిస్తున్న భూములకు నష్ట పోతున్న ప్రతి రైతుకు న్యాయమైన పరిహారం అందించేలా చర్యలు చేపడతామన్నారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, ఏపీఐఐసీ ప్రతినిధులు చంద్రశేఖర్, విజయకుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు, డీఎల్‌పీఓ వెంకటరమణ, ఎంపీడీఓ బానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా కృషి


ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపడుతున్న ఉమ

తిరుపతి సిటీ : మహిళా సాధికారతే లక్ష్యంగా శ్రీపద్మావతి యూనివర్సిటీ స్థాపించబడినదని, ఆ దిశగా తన వంతు కృషి చేస్తానని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వి.ఉమ తెలిపారు. శుక్రవారం మహిళా వర్సిటీలో ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 1983లో వర్సిటీ స్థాపించినప్పటి నుంచి అధ్యాపకులుగా పనిచేశామన్నారు. సుమారు 35 ఏళ్లకు పైగా బోధన, పరిశోధనా రంగాలలో అనుభవం ఉందని, గతంలో రెక్టార్‌గాను, ఇన్‌చార్జి వీసీగాను వర్సిటీకి సేవలందించానని చెప్పారు. మరో సారి ఇన్‌చార్జి వీసీగా అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందని, రుసా నిధులతో వర్సిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని, డిప్యూటీ రిజిస్ట్రార్ గీతావాణి, బోధన, బోధనేతర సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా భూపతి నాయుడు


బాధ్యతలు స్వీకరిస్తున్న భూపతినాయుడు

తిరుపతి సిటీ : ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ భూపతి నాయుడును నియమిస్తూ వీసీ అప్పారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం వర్సిటీ పరిపాలనాభవనంలో రిజిస్ట్రార్‌గా భూపతినాయుడు బాధ్యతలు చేపట్టారు. గత కొంత కాలంగా వర్సిటీలోని డీడీఈలో ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం రిజిస్ట్రార్‌ను వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది ఘనంగా సన్మానించారు.

శిక్షణతో బోధన సామర్థ్యాల పెంపు

– తిరుపతి డీఈఓ శేఖర్


శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

పుత్తూరు: క్షేత్ర స్థాయిలో విద్యా బోధనల్లో మార్పు స్పష్టంగా కనిపించాలని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న క్లాస్ రూమ్ అబ్జర్వేషన్ టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. డీఈఓ మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో గ్రహించిన, ఆకళింపు చేసుకున్న విషయాలతో బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. తద్వారా విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరిచేలా పాఠాలు బోధించాలన్నారు. 9 రోజుల శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుత్తూరు డీవైఈఓ ప్రభాకర్‌రాజు, ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, శిక్షకులు రమేష్, బాలసుబ్రమణ్యం, హిమగిరి, వేణుగోపాల్, పుత్తూరు, నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు, సత్యవేడు, వడమాలపేట మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుత ఆచూకీ ఎక్కడ?

- ట్రాప్ కెమెరాలతో అన్వేషణ

చంద్రగిరి: కొటాల జగనన్న కాలనీ సమీపంలో చిరుత సంచారాన్ని గుర్తించామని, దాన్ని పట్టుకోవడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్టు డీఎఫ్ఓ సతీష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కొటాల సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 16వ తేదీన కొటాల జగనన్న కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించి వీడియోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసినట్టు వెల్లడించారు. వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి 17వ తేదీన అడవిలో చిరుత పులి పాదముద్రలను గుర్తించినట్లు తెలిపారు. చిరుత కోసం ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు డ్రోన్ కెమెరాతో దాని ఆచూకీ కోసం గాలించినట్లు వెల్లడించారు. కొటాల, చుట్టుపక్కల గ్రామాలలో రెండు బృందాలతో రాత్రింబవళ్లు గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. పశువుల కాపరులు, గొర్రెల కాపర్లను అడవిలోకి వెళ్లరాదని సూచించారు. రాత్రి వేళల్లో ఒంటరిగా ఎవరూ బయటికి రాకూడదని చెప్పారు. ఆయన వెంట ఎఫ్ఆర్ఓ మాధవి, డీఆర్ఓ వేణు, ఎఫ్ఎస్ఓ చైతన్య, ఎఫ్‌బీఓలు అనిత, రజిని, యుగంధర్ ఉన్నారు.

రైస్ మిల్లు కేంద్రంగా గంజాయి విక్రయం


నెలబల్లి గ్రామ ప్రాంతంలోని రైస్ మిల్లు

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామ శివారులో ఉన్న రైస్ మిల్లు కేంద్రంగా కొందరు అక్రమార్కులు జోరుగా గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో ఉపాధి కోసం బయట రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు గంజాయి మత్తుకు బానిసవుతున్నారు. ఆ మత్తులో ఏం చేస్తున్నారో తెలియక నేరాలకు ఒడిగడుతున్నారు. ఇలాంటిదే మూడు రోజుల క్రితం చోటు చేసుకుంది. రైస్ మిల్లులోని బీహార్‌కు చెందిన దిలీప్‌కుమార్ గంజాయి మత్తులో అదే రైస్ మిల్లులో పనిచేస్తున్న ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ఆపై హత్య చేశాడు.

నాయుడుపేట టూ నెలబల్లి

నెలబల్లి గ్రామ సమీపంలో ఉన్న తెలుగు గంగ 7వ బ్రాంచ్ కాలువ వద్ద జాతీయ రహదారికి ఓ వైపు పలు దుకాణాలు ఉన్నాయి. వీటికి సమీపంలోనే రైస్ మిల్లు కూడా ఉంది. ఈ మిల్లులో 20 మంది బీహార్‌కు చెందిన కార్మికులు ఉన్నారు. ఇక్కడకి నాయుడుపేట నుంచి ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో కొందరు రాత్రి వేళ్లలో గంజాయి తీసుకొచ్చి దుకాణాలు వద్ద ఆగి ఉన్న లారీ వాహన దారులకు, మిల్లులో పనిచేస్తున్న కార్మికులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో గంజాయి వ్యాపారం గత కొంత కాలంగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులుగానీ, రైస్ మిల్లు యాజమాన్యం గానీ పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా స్పందించాల్సి ఉంది.

ఎస్వీయూ అభివృద్ధే లక్ష్యం


బాధ్యతలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు తెలిపారు. శుక్రవారం ఎస్వీయూ పరిపాలనా భవనంలో ఇన్‌చార్జి వీసీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత ఎస్వీయూ వీసీగా బాధ్యతలు చేపట్టడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు చెప్పారు. వర్సిటీలో గత 35ఏళ్లుగా ప్రొఫెసర్‌గా, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్‌గా, అకడమిక్ డీన్‌గా, డీఓఏ డైరెక్టర్‌గా, బీఓఎస్ చైర్మన్‌గా పలు హోదాల్లో విధులు నిర్వర్తించినట్లు వివరించారు. వర్సిటీతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, విద్యార్థుల భవిష్యత్ కోసం అహర్నిశలు శ్రమిస్తామని వెల్లడించారు. బోధన, బోధనేతర సిబ్బంది, అధికారుల సహకారంతో వర్సిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు. అనంతరం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చంద్రయ్య, ప్రొఫెసర్ భూపతినాయుడు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ఆయనను ఘనంగా సత్కరించారు.

చిరుద్యోగులపై వేధింపులు మానుకోవాలి

తిరుపతి కల్చరల్: జిల్లాలోని పలు పారంతాల్లో అంగన్‌వాడీ, ఆశా, సంఘమిత్ర, మధ్యాహ్న భోజనం, ఫీల్డ్ అసిస్టెంట్లు వంటి స్కీం వర్కర్లపై తెలుగుదేశం పార్టీ నేతలు సాగిస్తున్న రాజకీయ వేధింపులు మానుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ వేధింపులు ఉండవని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. శ్రీకాళహస్తి మండలం, ఎంపేడు గ్రామంలో టీడీపీ నేత పి.ఈశ్వర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, సెంటర్‌లో రికార్డులు ఎత్తుకెళ్లడం, లబ్ధిదారులను బెదిరించి తెల్లకాగితాల్లో సంతకాలు తీసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అంతేగాక ఉద్యోగానికి రాజీనామా చేయమని దాడి చేయడం చూస్తుంటే ఇంతకన్నా అరాచకం ఏముందని ప్రశ్నించారు. సీడీపీవోకు ఫిర్యాదు చేస్తే పోలీసులను సమర్థిస్తూ బాధితురాలిపైనే కేసు నమోదు చేయడం చేస్తే వేధింపులు ఎంత పరాకాష్టకు చేరాయో అర్థమవుతుందన్నారు. ఇదే మండలంలో 17 మంది ఫీల్డ్ అస్టెంట్లను ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. వెంకటగిరి మండంలో కస్తూరి కృష్ణవేణి అనే ఆశా వర్కర్‌ను స్థానిక టీడీపీ నేతలు బలవంతంగా రాజీనామా చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. చిరుద్యోగులపై చేస్తున్న వేధింపులను తక్షణమే మానుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలు కొనసాగించాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జీ.బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు జయచంద్ర, కార్యదర్శి ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.

తిరుపతి వాసికి బంగారు పతకం


చెన్నైలోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ నుంచి బంగారు పతకాన్ని అందుకుంటున్న తిరుపతికి చెందిన బత్తల రవితేజ్

తిరుపతి అర్బన్: న్యూరో సర్జరీ సూపర్ స్పెషాలిటీ మాస్టర్స్‌లో తిరుపతికి చెందిన డాక్టర్ బత్తల రవితేజ్ బంగారు పతకం సాధించాడు. తిరుపతిలోని ఉదయీ ఇంటర్నేషనల్ హోటల్ అధినేత గిరినాయుడు చిన్న కుమారుడు రవితేజ్ చెన్నైలోని శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ కళాశాలలో 2018–24లో న్యూరో సర్జన్‌లో మాస్టర్స్ పూర్తిచేశాడు. శుక్రవారం అతను కళాశాల స్నాతకోత్సవంలో భాగంగా ఛత్తీస్‌గఢ్ అమిటీ యూనివర్సిటీ చాన్స్‌లర్ సెల్వమూర్తి చేతులమీదుగా బంగారు పతకాన్ని అందుకున్నాడు. రవితేజ్ నెల్లూరులోని నారాయణ వైద్య కళాశాలలో 2018లో ఎంబీబీఎస్ పూర్తిచేశాడు. న్యూరో సర్జన్‌లో దేశీయ, విదేశీ వైద్యుల నుంచి శిక్షణ పొందిన ఆయన వ్యాధిగ్రస్తులకు ఉత్తమ వైద్యం అందించి ప్రత్యేక గుర్తింపును సాధించారు. ఆ మేరకు శనివారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

పనుల్లో వేగం పెంచండి

తిరుపతి తుడా: ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల్లో వేగం పెంచాలని తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శుక్రవారం ఇంజినీరింగ్, ఏఈకామ్, కాంట్రాక్టు ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగడంతో పాటు నగర భద్రతకు తోడ్పడుతుందని చెప్పారు. అధికారులు, నిర్మాణ నిర్వాహకులు సమన్వయం చేసుకుని పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగల చోరీ కేసులో రెండేళ్ల జైలు

తిరుపతి లీగల్ : ఇళ్లల్లోకి అక్రమంగా ప్రవేశించి బంగారు నగలను అపహరించుకెళ్లిన రెండు వేర్వేరు కేసుల్లో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా వందవాసి తాలూకా మజయుమలయుర్‌కు చెందిన రాఘవన్, విజయ్ అలియాస్ శివకు ఒక్కొక్క కేసులో రెండేళ్లు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి శుక్రవారం తీర్పుచెప్పారు. కోర్టు కానిస్టేబుల్ పణీంద్ర తెలిపిన వివరాల మేరకు.. 2022 జూన్ 8వ తేదీ తిరుపతి రూరల్ కాలూరు క్రాస్ వద్ద ఓ ఇంట్లోకి నిందితుడు అక్రమంగా ప్రవేశించి 33 గ్రాముల బంగారు నగలు, 570 గ్రాముల వెండి వస్తువులను అపహరించికెళ్లాడు. ఇంటి యజమాని రామమోహన్ ఫిర్యాదు మేరకు ఎంఆర్‌పల్లి పోలీసులు నిందితుడు విజయ్‌ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో అతనికి న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అదేవిధంగా మరో కేసులో 2022 సెప్టెంబర్ 8వ తేదీ ఎంఆర్ పల్లి గాయత్రీ నగర్‌లో ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి బంగారు నగలను నిందితుడు విజయ్ అపఅపహరించికెళ్లాడు. ఈ కేసులోనూ నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి రెండేళ్లు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ భాను కిరణ్మయి వాదించారు.

శుభకార్యానికి వెళ్లి వస్తూ..

- లారీ ఢీకొని ముగ్గురు మృతి
- ఒకరికి గాయాలు

పాకాల: సమీప బంధువులందరూ ఓ శుభకార్యంలో కలిశారు. ఆనందంగా గడిపారు. ఉదయం కూలి పనికి వెళ్లేందుకు ఆలస్యం కాకుండా సమయానికి చేరుకోవాలని ద్విచక్రవాహనంలో బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో లారీ మృత్యువు రూపంలో కబళించింది. ముగ్గురిని పొట్టన బెట్టుకుంది. ఈ ఘటన మండలంలో గురువారం రాత్రి విషాదాన్ని నింపింది. స్థానిక పోలీసుల కథనం.. రొంపిచెర్ల మండలం, బోడిపాటివారిపల్లి పంచాయతీ, దద్దాలవారిపల్లి గ్రామానికి చెందిన కె.నారాయణ, పాకాల మండలం, దామలచెరువు పంచాయతీ, చుక్కావారిపల్లికి చెందిన నాగరాజ, వాణి కుమారుడు ఇ.నాగమల్లయ్య, ఐరాల మండలం, వేదగిరివారిపల్లి పంచాయతీ, రామతీర్థ సేవాశ్రమ గ్రామానికి చెందిన కె.జయచంద్ర, అదే గ్రామం తీర్థ ఎస్టీ కాలనీకి చెందిన మనోజ్ అక్క కుమారుడు పురుడు కార్యక్రమంలో కలిశారు. కార్యక్రమం ముగిసిన తరువాత గురువారం రాత్రి 10 గంటల సమయంలో కూలిపని కోసం రొంపిచెర్లకు పయనమయ్యారు. ఉదయం పనిసమయానికి వెళ్లాలని నలుగురూ నారాయణ ద్విచక్ర వాహనంలో బయల్దేరారు. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై మండల పరిధిలోని కట్టకిందపల్లి సమీపంలోని పాత అక్కగార్ల గుడి వద్ద ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. లారీ ఢీకొన్న ప్రదేశం నుంచి ద్విచక్రవాహనాన్ని సుమారు 150 మీటర్లు ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో కె.నారాయణ(22), ఈ.నాగమల్లయ్య(16), కె.జయంద్ర(37) అక్కడికక్కడే మృతి చెందారు. మనోజ్ తీవ్ర గాయాలతో బయట పడ్డాడు. మృతి చెందిన నారాయణకు వివాహం జరిగి రెండేళ్లు కావస్తోంది. భార్య కె.శైలు ప్రస్తుతం గర్భవతి. ఎదిగి వచ్చిన కుమారుడు అండగా ఉంటాడనుకున్న నాగమల్లయ్య తల్లిదండ్రులు నాగరాజ, వాణికి నిరాశే మిగిలింది. కె.జయచంద్రకు భార్య నాగవేణితో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు 4వ తరగతి, కుమార్తె 2వ తరగతి చదువుతున్నారు. మిగిలిన ఒక బాబు అంగన్‌వాడీ, మరో చిన్నపాప ఉన్నారు. అడవుల్లో దొరికే గడ్డలు, పండ్లు, కూలి పనులతో జీవనం చేసుకునే వారు ప్రమాదవశాత్తు మృత్యుఒడికి చేరడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. శుక్రవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలించారు.

దేవుడా ఎందుకింత గర్భశోకం


జయచంద్ర మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు

ఐరాల: 'దేవుడా.. మేమేమి పాపం చేశాం. మాకెందుకింత శిక్ష వేశావు దేవుడా..! నలుగురు బిడ్డల్ని ఎలా సాకేది. కడుపులో ఉన్న నలుసుని ఎలా పెంచేది..'? మీరైనా చెప్పండి నాయనా..! అంటూ చుట్టుపక్కల ఉన్న వారిని అర్థిస్తూ.. గుండెలు బాదుకుంటూ ఆ గర్భవతులు రోదించిన తీరు గుండెల్ని పిండేసింది. ఈ విషాద ఘటన మండలంలోని గుండ్లపల్లె సిద్ధగిరిక్షేత్రం వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. పాకాల మండలం, దామలచెరువు సమీపంలోని పత్తిపాటివారిపల్లె అక్కగార్ల ఆలయం వద్ద గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఇందులో ఐరాల మండలం, గుండ్లపల్లె సిద్ధగిరి క్షేత్రం ఎస్టీ కాలనీకి చెందిన జయచంద్ర(30), నారాయణ(25), చుక్కావారిపల్లె ఎస్టీ కాలనీకి చెందిన నాగేంద్ర(14) ఉన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలు స్వగ్రామానికి తరలించారు. ఎస్టీ కాలనీకి చెందిన జయచంద్రకు నలుగురు పిల్లలు కాగా.. ప్రస్తుతం భార్య గర్భవతి. నారయణ భార్య నాగమణి కూడా గర్భిణి. నాగేంద్ర కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. వీరితో పాటు ఎస్టీ కాలనీకి చెందిన మనోజ్ తీవ్ర గాయాలతో కొత్తకోట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం మృతదేహాలు వారి స్వగ్రామాలకు చేరడంతో కుటుంబీకులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. నారాయణ అంత్యక్రియలు రొంపిచెర్లలో నిర్వహించగా.. నాగేంద్ర, జయచంద్ర అంత్యక్రియలు చుక్కావారిపల్లె ఎస్టీ కాలనీలో నిర్వహించారు.